https://teluguislam.net


# ఏతెకాఫ్‌కు సంబంధించిన విషయాలు

**132వ అంశం :** ఏతెకాఫ్ సున్నతె ముఅక్కదా కిఫాయ (అంటే తాకీదు చేయబడిన సామూహిక సంప్రదాయం). దీని గడువు పదిరోజులు.

**133వ అంశం :** రమజాన్ మాసంలో ప్రతి ముస్లిం కనీసం ఒకసారయినా మొత్తం ఖురాన్ పారాయణం చేయాలి.

عَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللهُ عَنْهُ قَالَ: كَانَ يُعْرَضُ عَلَى النَّبِيِّ صَلَّى اللهُ عَلَيْهِ وَسَلَّمَ الْقُرْآنُ كُلَّ عَامٍ مَرَّةً فَعُرِضَ عَلَيْهِ مَرَّتَيْنِ فِي الْعَامِ الَّذِي قُبِضَ وَكَانَ يَعْتَكِفُ كُلَّ عَامٍ عَشْرًا فَاعْتَكَفَ عِشْرِينَ فِي الْعَامِ الَّذِي قُبِضَ. رواه البخاري[1]

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం : ప్రతి సంవత్సరం (రమజాన్ నెలలో) దైవప్రవక్త (సల్లం) ముందు పూర్తి ఖురాన్ ఒకసారి పారాయణం చేయబడేది. ఆయన మరణించిన సంవత్సరంలోనయితే ఆయనకు రెండుసార్లు మొత్తం ఖురాన్ వినిపించబడింది. అదే విధంగా ప్రతి సంవత్సరం ఆయన పదిరోజులు ఏతెకాఫ్ పాటించేవారు. అయితే తను మరణించిన సంవత్సరంలో ఆయన ఇరవై రోజులు ఏతెకాఫ్ పాటించారు. *(బుఖారీ)*[1]

**134వ అంశం :** ఏతెకాఫ్ పాటించదలచుకున్నప్పుడు ఫజ్ర్ నమాజ్ తర్వాత దాని స్థలంలోకి వెళ్ళిపోవటం మస్నూన్ (సంప్రదాయం).

عَنْ عَائِشَةَ رَضِيَ اللهُ عَنْهَا قَالَتْ: كَانَ رَسُولُ اللهِ صَلَّى اللهُ عَلَيْهِ وَسَلَّمَ إِذَا أَرَادَ أَنْ يَعْتَكِفَ صَلَّى الْفَجْرَ ثُمَّ دَخَلَ فِي مُعْتَكَفِهِ. رواه ابوداؤد وابن ماجه[2] (صحيح)

హజ్రత్ ఆయిషా (రజి.అన్హా) కథనం : దైవప్రవక్త (సల్లం) ఏతెకాఫ్ చేయదలచుకున్నప్పుడు ఫజ్ర్ నమాజ్ చేసుకొని ఆ తర్వాత ఏతెకాఫ్ స్థలంలోకి వెళ్ళిపోయేవారు.

*(అబూదావూద్, ఇబ్నెమాజా-సహీహ్)*[2]

**135వ అంశం :** ఏతెకాఫ్ పాటిస్తున్న తన భర్తను కలుసుకోవటానికి భార్య వెళ్ళవచ్చు. అదే విధంగా ఏతెకాఫ్ పాటిస్తున్న వ్యక్తి తన భార్యను ఇంటి దగ్గర వదలి పెట్టిరావటానికి మస్జిద్ బయటకు వెళ్ళవచ్చు.

عَنْ صَفِيَّةَ رَضِيَ اللهُ عَنْهَا قَالَتْ: كَانَ رَسُولُ اللهِ صَلَّى اللهُ عَلَيْهِ وَسَلَّمَ مُعْتَكِفًا فَأَتَيْتُهُ أَزُورُهُ لَيْلاً فَحَدَّثْتُهُ ثُمَّ قُمْتُ لأَنْقَلِبَ فَقَامَ مَعِيَ لِيَقْلِبَنِي. متفق عليه[1]

---

*1) అల్‌బానీ గారి మిష్కాతుల్ మసాబీహ్ గ్రంథం మొదటి సంపుటి 2152వ హదీసు*

*2) అల్‌బానీ గారి సహీహ్ సుననె అబూదావూద్ మొదటి సంపుటి 2152వ హదీసు*

https://teluguislam.net



హజ్రత్ సఫియ్యా (రజి.అన్హా) కథనం : దైవప్రవక్త (సల్లం) ఏతెకాఫ్ పాటిస్తున్నప్పుడు ఓ రోజు రాత్రి నేనాయన్ని కలవటానికి వెళ్ళాను. కాసేపు ఆయన దగ్గరే మాట్లాడుతూ కూర్చున్నాను. ఆ తర్వాత తిరిగి వెళ్ళిపోదామని లేచి నించోగానే దైవప్రవక్త (సల్లం) కూడా నన్ను వదలిపెట్టి రావటానికి లేచి నించున్నారు. (బుఖారీ-ముస్లిం)[1]

**136వ అంశం :** పురుషులు ఏతెకాఫ్ మస్జిద్‌లోనే పాటించాలి.

**137వ అంశం :** రమజాన్‌లో ఏతెకాఫ్ పాటించటానికి ఉపవాసం ఉండటం తప్పనిసరి.

**138వ అంశం :** ఏతెకాఫ్ స్థితిలో వ్యాధిగ్రస్తుల్ని పరామర్శించటానికి వెళ్ళటం, జనాజాలో పాల్గొనటం, భార్యతో సంభోగించటం, మానవ అవసరాల కోసం కాకుండా అనవసరంగా బయటికి వెళ్ళటం చేయరాదు.

عَنْ عَائِشَةَ رَضِيَ اللهُ عَنْهَا قَالَتْ: السُّنَّةُ عَلَى الْمُعْتَكِفِ أَنْ لَا يَعُوْدَ مَرِيْضًا وَلَا يَشْهَدَ جَنَازَةً وَلَا يَمَسَّ امْرَأَةً وَلَا يُبَاشِرَهَا وَلَا يَخْرُجَ لِحَاجَةٍ إِلَّا لِمَا لَا بُدَّ مِنْهُ وَلَا اعْتِكَافَ إِلَّا بِصَوْمٍ وَلَا اعْتِكَافَ إِلَّا فِي مَسْجِدٍ جَامِعٍ رواه ابوداود[2] (حسن)

హజ్రత్ ఆయిషా (రజి.అన్హా) కథనం : సున్నత్ పద్ధతి ప్రకారం ఏతెకాఫ్ పాటిస్తున్న వ్యక్తి వ్యాధిగ్రస్తుల్ని పరామర్శించటానికి వెళ్ళరాదు. జనాజాల్లో పాల్గొనరాదు. భార్యను ముట్టుకోవటం గాని ఆమెతో సంభోగించటం కాని చేయరాదు. గత్యంతరం లేదనుకుంటే తప్ప మస్జిద్ బయటకు వెళ్ళకూడదు. ఏతెకాఫ్ పాటించాలంటే ఉపవాసం తప్పనిసరి. అదే విధంగా ఏతెకాఫ్ జామెమస్జిద్ లోనే పాటించాలి. (అబూదావూద్-హసన్)[2]

**139వ అంశం :** స్త్రీలు కూడా ఏతెకాఫ్ పాటించాలి

عَنْ عَائِشَةَ رَضِيَ اللهُ عَنْهَا أَنَّ النَّبِيَّ صَلَّى اللهُ عَلَيْهِ وَسَلَّمَ كَانَ يَعْتَكِفُ الْعَشْرَ الْأَوَاخِرَ مِنْ رَمَضَانَ حَتَّى تَوَفَّاهُ اللهُ ثُمَّ اعْتَكَفَ أَزْوَاجُهُ مِنْ بَعْدِهِ. رواه مسلم[1]

హజ్రత్ ఆయిషా (రజి.అన్హా) కథనం : దైవప్రవక్త (సల్లం) రమజాన్ నెలలోని చివరి దశకంలో ఏతెకాఫ్ పాటిస్తూ ఉండేవారు. ఆఖరికి ఆయన మరణానంతరం ఆయన భార్యలు ఏతెకాఫ్ పాటించారు. (ముస్లిం)[3]

---

*1) మున్తఖల్ అఖ్‌బార్ గ్రంథం మొదటి సంపుటి 2280వ హదీసు*

*2) అల్‌బానీ గారి సహీహ్ సునన్ అబూదావూద్ మొదటి సంపుటి 2160వ హదీసు*

*3) అల్‌బానీ గారి సహీహ్ ముస్లిం - సంక్షిప్తం - 633వ హదీసు*

https://teluguislam.net



**140వ అంశం :** స్త్రీలు తమ ఇండ్లలోనే ఏతెకాఫ్ పాటించాలి.

عَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللهُ عَنْهُ قَالَ: قَالَ رَسُوْلُ اللهِ صَلَّى اللهُ عَلَيْهِ وَسَلَّمَ لَا تَمْنَعُوْا نِسَآءَ كُمُ الْمَسَاجِدَ وَبُيُوْتُهُنَّ خَيْرٌ لَّهُنَّ . رواه ابوداود[1] ( صحيح )

హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు: స్త్రీలను మస్జిద్‌లకు వెళ్ళకుండా ఆపకండి. అయితే (నమాజు చేయటానికి) స్త్రీల కొరకు మస్జిద్‌ల కన్నా వారి ఇళ్లే ఉత్తమ స్థలాలు. (అబూదావూద్-సహీహ్)[1]

**141వ అంశం :** ఎవరికయినా పూర్తిగా పదిరోజులు ఏతెకాఫ్ పాటించే అవకాశం లభించకపోతే వారు ఎన్ని రోజులు మిగులుంటే అన్ని రోజులు పాటించాలి. ఆఖరికి ఒక రాత్రయినా ఏతెకాఫ్ పాటించవచ్చు.

عَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللهُ عَنْهُمَا أَنَّ عُمَرَ سَأَلَ النَّبِيَّ صَلَّى اللهُ عَلَيْهِ وَسَلَّمَ قَالَ: كُنْتُ نَذَرْتُ فِي الْجَاهِلِيَّةِ أَنْ أَعْتَكِفَ لَيْلَةً فِي الْمَسْجِدِ الْحَرَامِ؟ قَالَ: أَوْفِ بِنَذْرِكَ . رواه البخاري[2]

ఇబ్నె ఉమర్ (రజి) కథనం : (మా నాన్నగారు) ఉమర్ (రజి) దైవప్రవక్త (సల్లం)ను అడిగారు, "అజ్ఞాన కాలంలో నేను మస్జిదె హరాంలో ఓ రాత్రి ఏతెకాఫ్ పాటిస్తానని మొక్కుకున్నాను. మరి ఇప్పుడు నేనా మొక్కుబడిని నెరవేర్చగలనా?" అని. అందుకాయన "సరే, నీ మొక్కుబడిని తీర్చుకో" అని అన్నారు. (బుఖారీ)[2]

---

*1) అల్‌బానీ గారి సహీహ్ సుననె అబూదావూద్ మొదటి సంపుటి 530వ హదీసు*

*2) ఉపవాస ప్రకరణం*